

రేషన్ బియ్యం పట్టివేత

వెంకటగిరి రూరల్(బాలాయపల్లి): అక్రమంగా తరలుతున్న 112 బస్తాల రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన బాలాయపల్లె మండలంలో చోటుచేసుకుంది. - 8లో



పోలీస్ జీపును ఢీకొన్న ట్రాక్టర్

నాయుడుపేట టౌన్ : పండ్లూరు ఉక్కు పరిశ్రమ సమీపంలో పోలీసు జీపును ట్రాక్టర్ అదుపుతప్పి ఢీకొంది. ఈ ఘటనలో సీఐ ప్రభాకర్‌రావుతో పాటు మరో ముగ్గురు గాయపడ్డారు. -8లో



పెద్దకొట్టాయి ఉత్సవం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం పెద్దకొట్టాయి ఉత్సవం జరిగింది. ఆలయంలోని అలంకార మండపంలో స్వామి, అమ్మవార్లకు అభిషేక పూజలు నిర్వహించారు.



న్యూస్‌రీల్

నేటి నుంచి ఐఐటీలో తిరుత్సవ్


ఐఐటీ తిరుపతి ముఖద్వారం

ఏర్పేడు: మేర్లపాక రెవెన్యూ పరిధిలోని ఐఐటీ తిరుపతి క్యాంపస్‌లో శుక్రవారం నుంచి తిరుత్సవ్ వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్టు డైరెక్టర్ కేఎన్.సత్యనారాయణ తెలిపారు. ఈనెల 31 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. 2023 ఐఐటీ తిరుపతి వార్షిక సాంకేతిక సాంస్కృతిక ఉత్సవాల్లో భాగంగా మూడు రోజుల పాటు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాల ప్రదర్శన, సాయంత్రం 7.30 నుంచి రాత్రి 10.30 గంటల వరకు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

మొదటి రోజు కార్యక్రమాలు

త్రిషూర్ హంట్, స్పాట్ లైట్ (ఫ్యాషన్ షో) రౌండ్, వన్ ఆన్, లేచెప్, బ్రిడ్జ్ బజూకా తదితర ఈవెంట్‌లు జరగనున్నాయి.

తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సులు



తిరుపతి అర్బన్: పౌర్ణమి సందర్భంగా ఏప్రిల్ 6 నుంచి తిరువణ్ణామలైకు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ప్రజారవాణాధికారి చెంగల్‌రెడ్డి తెలిపారు. తిరుపతి నుంచి సాధారణ బస్సులతోపాటు ఏసీ బస్సులను ఏర్పాటు చేయనున్నట్టు ఆయన వెల్లడించారు. ఉదయం 6 నుంచి గంటకు ఓ సర్వీస్ చొప్పున తిప్పుతామన్నారు.

ప్రాణదాన పథకానికి 154 మంది ఎంపిక

తిరుపతి తుడా : స్విమ్స్‌లో టీటీడీ ప్రాణదాన పథకం ద్వారా పేదలకు ఉచిత శస్త్ర చికిత్సలను నిర్వహించేందుకు 150 మంది రోగులను ఎంపిక చేసినట్టు స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ వెంగమ్మ తెలిపారు. ఇందులో నెఫ్రాలజీ–12, రేడియేషన్ ఆంకాలజీ–13, న్యూరోసర్జరీ–34, గ్యాస్ట్రో ఎంట్రాలజీ–12, న్యూరాలజీ–26, మెడిసిన్–25, సర్జికల్ ఆంకాలజీ –14, కార్డియాలజీ–2, కార్డియోథొరాఫిక్ –10, మెడికల్ ఆంకాలజీ–5, యూరాలజీ–1 మొత్తం 154 మంది పేదరోగులను ఈ పథకానికి ఎంపిక చేసినట్టు చెప్పారు.




■ 'ఇది పలమనేరు నియోజకవర్గంలోని పెద్దపంజాణి మండలం, కెళవాతి గ్రామానికి చెందిన ఎర్రబల్లి శ్రీనివాసులు ఇల్లు. నాటి టీడీపీ మంత్రి అమరనాథ్‌రెడ్డి సొంత గ్రామం కూడా ఇదే. తాను వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేగా గెలిచి.. టీడీపీలోకి వెళుతున్నపుడు శ్రీనివాసులు పార్టీ మారలేదన్న అక్కసుతో అతనిపై పగబట్టారు. దళితుడైన శ్రీనివాసులుపై రేప్ కేసుతో పాటు మరో ఆరు కేసుల్లో ఇరికించాడు. ఊర్లో నుంచి వెలివేయించాడు. అన్నీ దిగమింగుకున్న శ్రీనివాసులు ఇప్పటికీ ఊరి చివర ఉన్న తన పొలంలో ఇల్లు కట్టుకుని జీవించాల్సిన పరిస్థితి.

■ 'చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో 2017లో తాను చెప్పినట్టు రూ.10 లక్షల విలువైన బిల్లులు రాయలేదని టీడీపీ మహిళా కార్పొరేటర్ భర్త నాయుడు దౌర్జన్యానికి పాల్పడ్డాడు. దళిత మహిళా ఇంజినీరును అందరిముందే కుర్చీతో కొట్టబోయాడు. ఆమెను కార్పొరేషన్ కార్యాలయం నుంచి బయటకు పంపే వరకు శాంతించ లేదు. బాధితురాలు పోలీసులను ఆశ్రయించినా నో కేస్!'



■ 2019 సాధారణ ఎన్నికల సందర్భంగా పూతలపట్టు నియోజకవర్గం, ఐరాల మండలం, కట్టకిందపల్లి గ్రామ పరిధిలోని దళితులను ఓట్లేయనీయకుండా టీడీపీ నేతలు అడ్డుకున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ బాబు గ్రామానికి వెళ్లి దళితులకు ధైర్యం చెప్పారు. అనంతరం తిరిగి వెళ్తుండగా చెరువు వద్ద ఆయన్ని అటకాయించి దాడిచేశారు. ఆయన ప్రయాణిస్తున్న కారును ధ్వంసం చేశారు. రక్తగాయాలతో ఎంఎస్ బాబు ఆస్పత్రి పాలయ్యారు. తవణంపల్లి మండల పరిధిలోని వైఎస్సార్‌సీపీ నాయకులపై టీడీపీ నేతలు అక్రమంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయించారు.

■ చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో 2014–2019 కాలంలో దళితులపై దాడులకు సంబంధించి 54 కేసులు నమోదయ్యాయి. రామకుప్పం మండలంలో అప్పటి సీఎం చంద్రబాబు దిష్టి బొమ్మ దహనం చేశారని 2017లో 14 మందిపై కేసులు నమోదు చేశారు. తమిళనాడు నుంచి కర్ణాటకకు అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని పట్టించినందుకు సెంథిల్‌కుమార్, మురుగేష్‌పై అక్రమ కేసులు బనాయించారు.

.... ఇవి మచ్చుకు కొన్ని మాత్రమే.

2014 నుంచి ఐదేళ్ల పాటు అధికారంలో ఉన్న టీడీపీ హయాంలో దళితులపై జరిగిన దమనకాండ అంతాఇంతకాదు. ఇటువంటి సంఘటనలు కోకొల్లలు. ఎలాంటి సాక్ష్యాలు లేకుండా ఎందరో దళితులను ఇబ్బందులకు గురిచేసిన చిట్టా చాలా పెద్దగానే ఉంది. ఇదంతా కప్పిపుచ్చిన పచ్చ మీడియా ఇప్పుడున్న ప్రభుత్వంలో దళితులపై దాడులు పెరిగాయని.. అప్పట్లో దళితులకు చంద్రబాబు నాయుడు రెడ్ కార్పెట్ పరచారంటూ తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను మభ్యపెట్టే యత్నం చేయడం విస్మయానికి గురిచేస్తోంది.

దళితులపై దాడిచేసి.. ప్రభుత్వంపై నిందలేసి!

- టీడీపీ హయాంలో దళితులపై దౌర్జన్యకాండ
- ఓట్లేయనీయకుండా అడ్డుకున్న చంద్రబాబు
- ఊర్లు వదిలి వెళ్లిన దళితకుటుంబాలు
- ప్రశ్నించినందుకు నాడు ఎంఎస్ బాబుపైనా దాడి

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో..	
సంవత్సరం	అట్రాసిటీ కేసులు
2014	140
2015	102
2016	139
2017	124
2018	114
2019	146

సాక్షి, తిరుపతి/చిత్తూరు అర్బన్: దళితులుగా ఎవరైనా పుట్టాలనుకుంటారా..? ఈ మాట వింటే ఠక్కున గుర్తుకొచ్చేది ఫార్టీ ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకుని చంద్రబాబు పేరే. ఆయన హయాంలో జిల్లాలో దళితులపై దాడుల పరంపర కొనసాగింది. అంతెందుకు కనీసం ఓట్లు కూడా స్వేచ్ఛగా వేయలేని దుస్థితి ఏర్పడింది. వాటికథ.. కమామీసు మీకోసం..

దళితులపై దండయాత్ర

చంద్రగిరి నియోజకవర్గం, రామచంద్రాపురం మండల పరిధిలోని కమ్మకండ్రిగ, కమ్మపల్లి, రావిళ్లవారిపల్లి, ఎన్ఆర్ కమ్మపల్లి, గణేష్‌పురం, టీటీ కండ్రిగ పరిధిలోని దళిత, గిరిజనులు ఊర్లోకి వచ్చి ఓట్లేయనీకుండా టీడీపీ నాయకులు అడ్డుకునేవారు. పోలింగ్ బూత్‌లలోకి దూరి రిగ్గింగ్‌కు పాల్పడేవారు. 2019 మే 11న ఓటేసేందుకు వెళ్తున్న పలువురు దళిత, గిరిజనులపై దాడులు చేశారు. వారికి మద్దతుగా వెళ్లిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిపైనా, ఆయన సతీమణి లక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడికి తెగబడ్డారు. టీడీపీ దౌర్జన్యాలను కవర్ చేసేందుకు వెళ్లిన పలువురు దళిత జర్నలిస్టుల కెమెరాలు లాక్కొని తరిమి తరిమి కొట్టారు. వాహనాలను ధ్వంసం చేశారు. ఈ సంఘటనపై రామచంద్రాపురం పోలీస్ స్టేషన్‌లో కేసులు కూడా నమోదయ్యాయి. చివరకు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి న్యాయస్థానాన్ని ఆశ్రయించి దళిత, గిరిజనులకు ఓటువేసే హక్కును కల్పించారు.


2019లో టీడీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన పూతలపట్టు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ బాబు


ఖాకీల ప్రేక్షక పాత్ర

టీడీపీ హయాంలో దళితులపై దాడులు జరుగుతున్నా పోలీసుశాఖ అడ్డుకట్ట వేయలేకపోయింది. నాడు జిల్లా పోలీసు బాసు నుంచి అప్పటి ప్రత్యేక విభాగం ఉన్నతాధికారి వరకు అందరూ పెద బాబు, చిన బాబు, నాటి మంత్రి కనుసన్నల్లో మెలిగేవారు. చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఇంజినీరుపై దాడికి యత్నించినా.. ఇక్కడున్న ఓ దళిత ఉద్యోగి చెంప చెళ్లు మనిపించినా అడిగే దిక్కు లేకుండాపోయింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఎంతోమంది దళిత అధికారులపై భౌతిక దాడులు చేసినా నోరెత్తలేకపోయారు. బాధిత దళితులు పోలీసులకు ఫిర్యాదు చేస్తే కార్యాలయంలో కూర్చుని పంచాయితీ చేసుకోవాలని పంపించేసేవారు. ఎక్కడా అట్రాసిటీ కేసులు పెట్టలేదు.

శ్రీరామ నీ నామమెంతో రుచిరా!


తిరుమలలో హనుమంత వాహనంపై ఊరేగుతున్న శ్రీరాముడు

జిల్లాలో శ్రీరామనవమి సంబరాలు అంబరాన్నంటాయి. పలు మండలాల్లో సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. తిరుమలలో శ్రీరామనవమి ఆస్థానాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. - తిరుమల


స్నపన తిరుమంజనంలో ఈఓ దంపతులు, చైర్మన్ సతీమణి


తరలివచ్చిన భక్తజనం

'పది'కి పకడ్బందీ ఏర్పాట్లు

- జిల్లా వ్యాప్తంగా 152 పరీక్ష కేంద్రాలు
- హాజరుకానున్న 28,413 మంది విద్యార్థులు
- డీఈఓ డాక్టర్ వి.శేఖర్


డాక్టర్ వి.శేఖర్, (డీఈఓ), తిరుపతి జిల్లా

తిరుపతి ఎడ్యుకేషన్ : పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి 18వ తేదీ వరకు జరగనున్నట్లు తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) డాక్టర్ వి.శేఖర్ తెలిపారు. తిరుపతి జిల్లాలో పది పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు వెల్లడించారు. ఫలితాల్లో జిల్లా మెరుగైన స్థానం సాధించేలా విద్యార్థులను సంసిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా ఆయా పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులతో ప్రత్యేక తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకునేందుకు నిత్యం పరీక్షలు నిర్వహించి, ఎక్కడ వెనుకబడ్డారో గుర్తించి వారికి పూర్తిశిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ముఖ్యంగా వెనుకబడ్డ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని కనీస మార్కులతో పాసయ్యేలా చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. పది పరీక్షల నిర్వహణకు సంబంధించిన వివరాలను ఆయన 'సాక్షి'కి తెలిపారు. ఆయన మాటల్లోనే

తిరుపతి జిల్లాలో పదోతరగతి పరీక్షలకు మొత్తం 152 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశాం. ఇందులో రెగ్యులర్ 26,673, ప్రైవేటు 1,740 మంది, మొత్తం 28,413 మంది విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్నారు. పరీక్షా కేంద్రాలను ఏ, బీ, సీ మూడు రకాలుగా విభజించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా నిర్వహించేందుకు పక్కాగా ఏర్పాట్లు చేపట్టాం. పరీక్షల్లో అవకతవకలకు తావులేకుండా సజావుగా నిర్వహించేందుకు ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్లు, పది సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటుచేశాం. అలాగే సమస్యాత్మకమైన మూడు పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం.

వసతుల కల్పన : పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పించాం. గత అనుభవాల దృష్ట్యా నేల పరీక్షకు తావులేకుండా అన్ని పరీక్ష కేంద్రాల్లో డెస్కులను ఏర్పాటుచేశాం. ఎండల దృష్ట్యా తాగునీటి వసతిని కేంద్రాల్లో ఏర్పాటుచేశాం. కలెక్టర్ ఆదేశాల మేరకు పరీక్ష సమయంలో నిరంతరాయ విద్యుత్ సరఫరా, అత్యవసర చికిత్స నిమిత్తం ప్రతి పరీక్షా కేంద్రం వద్ద వైద్య సిబ్బంది, విమర్శలకు తావులేకుండా పరీక్షల నిర్వహణకు పోలీస్ పహారా, పరీక్షల సమయంలో ఆయా రూట్లలో విరివిగా ఆర్టీసీ బస్సులు తిరిగేలా సంబంధిత అధికారులు అన్ని చర్యలు తీసుకున్నారు.

నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదు : పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు జరుగుతాయి. పరీక్షా సమయానికి అరగంట ముందు నుంచే విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తాం. నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదు. హాల్ టికెట్లో పేర్కొన్న పరీక్షా కేంద్రాలను విద్యార్థులు ఒకరోజు ముందే వెళ్లి సరిచూసుకోవాలి. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్లు, క్యాలికులేటర్ తదితర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోము.

సుమాల సౌరభం.. అద్వితీయ పరిమళం

సుమనోహర సుమం.. దేవుని సన్నిధిలో పరవశిస్తుంది. సర్వాంతర్యామి అలంకరణలో మెరుస్తూ మురిసిపోతుంది.. నిత్య పూజలో పరిమళించి పులకిస్తుంది.. దివ్య తేజస్సును స్పృశించి పునీతమవుతుంది. మరుదినమే వడలిన వదనంతో చిన్నబోతుంది. స్వామిని వీడలేక విలపిస్తుంది. పవిత్ర పాదాలకు దూరమై కుమిలిపోతుంది. పుష్పవిలాపాన్ని గుర్తించిన టీటీడీ వాడిన విరులను మళ్లీ వినియోగించాలని సంకల్పించింది. దేవతామూర్తులకు అలంకరించిన సుగంధ కుసుమాలను వృథాగా పడేయకుండా అగరబత్తీలను తయారు చేస్తోంది. పరమపావన ప్రాంగణంలో పునఃపరిమళించే మహద్భాగ్యం కల్పిస్తోంది.

- టీటీడీ గోశాలలో రెండో దశ అగరబత్తీల యూనిట్
- పశువులకు పౌష్టికాహారం
- రూ.11 కోట్లతో ఎస్వీ ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్
- నేడు ప్రారంభించనున్న టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి
- ఏర్పాట్లను పరిశీలించిన జేఈఓ, సీఈ

తిరుపతి రూరల్: టీటీడీ సహకారంతో దర్శన్ ఇంటర్నేషనల్ సంస్థ 2021లో ప్రారంభించిన అగరబత్తీల మహాయజ్ఞం ప్రపంచ వ్యాప్తంగా శ్రీవారి స్వామి భక్తుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. రోజుకు 3.5 లక్షల అగరబత్తీలను తయారు చేస్తున్నారు. భక్తుల అవసరాల కనుగుణంగా అగరబత్తీల తయారీని మరింత పెంచేసుందుకు టీటీడీ, దర్శన సంస్థలు సంకల్పించాయి. రోజుకు 7 లక్షల నుంచి 7.5 లక్షల అగరబత్తీలను తయారు చేసేందుకు ఏర్పాట్లు చేపట్టారు. ఇప్పటికే తిరుపతిలోని టీటీడీ గోశాలలో ప్రత్యేక షెడ్లను వేశారు. యంత్రాల సామర్థ్యాలను పెంచారు. రోజుకు 1,700 కిలోల పువ్వులు అవసరమని గుర్తించారు. తిరుమల, తిరుపతి చుట్టుపక్కల టీటీడీ ఆలయాల నుంచే కాకుండా టీటీడీ పరిధిలోని ఒంటిమిట్ట, నాగాలపురం, నారాయణవనం ఆలయాల నుంచి కూడా దేవుళ్ల సేవలో ఉపయోగించిన పూలను సేకరిస్తున్నారు.

రూ.11 కోట్లతో ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్

గోసేవకు కూడా టీటీడీ అధిక ప్రాధాన్యత ఇస్తోంది. అందులో భాగంగా టీటీడీ పరిధిలోని ఎస్వీ గోశాలను సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌గా తీర్చిదిద్దుతున్నారు. వేలాది గోవులు, పశువులకు అవసరమైన పౌష్టికాహారం అందించేందుకు ప్రత్యేకంగా రూ.11 కోట్లతో ఎస్వీ ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్‌ను నిర్మించారు. గంటకు ఐదు టన్నుల ఫీడ్‌ను ఇక్కడ తయారు చేస్తారు. ఎస్వీ వెటర్నరీ వర్సిటీ, అమెరికాకు చెందిన న్యూటెక్ బయోసైన్సెస్ సాంకేతిక సహకారంతో టీటీడీ దీనిని నిర్మించింది. అందుకు అవసరమైన మొత్తం నిధులను ఓ దాత ఏర్పాటు చేశారు. తిరుపతి, పలమనేరులో ఉన్న గోశాలల్లో దాదాపు 3 వేలకు పైగా గోవులు, పశువులు ఉన్నాయి. ఏడాదికి వాటికి 3,500 టన్నుల వరకు దాణా అవసరం. అంతేకాకుండా వెటర్నరీ వర్సిటీ పరిధిలోని రీసెర్చ్ స్టేషన్లలో దాదాపు వెయ్యి వరకు పశువులు ఉన్నాయి. టీటీడీ గోశాలల్లోని పశువులకు అవసరమైన ఫీడ్‌ను అందించిన తర్వాత వెటర్నరీ వర్సిటీ అవసరాలకు కేటాయిస్తారు. మిగిలిన ఫీడ్‌ను రైతులకు అందించేందుకు టీటీడీ ఆలోచన చేస్తోంది. ఫార్ముల–1, 2, 3, అంటూ మూడు విభాలుగా తయారు చేస్తున్న ఈ సమగ్ర పోషకాలు కలిగిన దాణాను వేయడం వల్ల పశువులు, గోవుల్లో 15 నుంచి 20 శాతం పాల ఉత్పత్తి, అలాగే వెన్నశాతం పెరుగుతుందని వెటర్నరీ వర్సిటీ న్యూట్రీషియన్ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. వెటర్నరీ వర్సిటీ పరిధిలోని న్యూట్రీషియన్ డిపార్ట్‌మెంట్ విద్యార్థులకు ఇక్కడ శిక్షణ కూడా ఇస్తారు. ఎప్పటికప్పుడు దాణాలో పోషకాలను పరిశీలించేందుకు వెటర్నరీ వర్సిటీలో ఫీడ్ అనాలసీస్ ల్యాబొరేటరీని కూడా ఏర్పాటు చేశారు.


టీటీడీ గోశాలలో ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్ ప్రారంభోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేఈఓ సదాభార్గవి, సీఈ నాగేశ్వరరావు

నేడు ప్రారంభించనున్న టీటీడీ చైర్మన్

తిరుపతిలోని టీటీడీ గోశాలలో విస్తరించిన రెండో దశ అగరబత్తీల కేంద్రాన్ని, ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్‌లను శుక్రవారం టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈఓ ధర్మారెడ్డి ప్రారంభించనున్నారు. ఆమేరకు గురువారం సాయంత్రం టీటీడీ జేఈఓ సదాభార్గవి, చీఫ్ ఇంజినీరు నాగేశ్వరరావు ఏర్పాట్లను పరిశీలించారు. ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్ వద్ద బ్యాగుల్లో దాణాను నింపే ప్రక్రియను ప్రయోగాత్మకంగా పరిశీలించారు.

రూ.2,149 కోట్ల ఆదాయపు పన్ను వసూలు



మాట్లాడుతున్న దుర్గేష్‌సామ్రాట్

తిరుపతి రూరల్: రాయలసీమ, నెల్లూరు జిల్లాల పరిధిలో ఈ ఏడాది రూ.2,149 కోట్ల ఆదాయపు పన్ను వసూలు చేసినట్టు ఆ శాఖ తిరుపతి చార్జ్ ప్రిన్సిపల్ కమిషనర్ దుర్గేష్ సామ్రాట్ తెలిపారు. తిరుపతిలోని ఆదాయపుపన్ను శాఖ ప్రధాన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 2022–23 ఏడాదికి రూ.1,583 కోట్ల పన్నులు వసూళ్లను టార్గెట్‌గా నిర్ణయించుకున్నామని, అయితే ఇప్పటి వరకు రూ.2,149 కోట్లను రాబట్టినట్టు చెప్పారు. తిరుపతి చార్జ్ జ్యూరిడిక్షన్ పరిధిలో మొత్తం 13,14,102 మంది పన్ను చెల్లింపుదారులు ఉన్నారని తెలిపారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈఏడాది నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లాల పరిధిలో రూ.1,811 కోట్లను రిఫండ్‌గా ఆదాయపు పన్ను చెల్లింపుదారులకు చెల్లించినట్లు చెప్పారు. అడ్వాన్స్ ట్యాక్స్, ఇతర లావాదేవిల్లో రిఫండ్‌గా ఈ మొత్తాన్ని చెల్లించామన్నారు. వందశాతం గ్రీవెన్స్‌ను క్లియర్ చేసినట్లు తెలిపారు. గతేడాది రూ.738 కోట్లను మాత్రమే రిఫండ్ చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

పాన్, ఆధార్ అనుసంధానం తప్పనిసరి

పాన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఆధార్‌తో అనుసంధానం చేసుకోవాలని ప్రిన్సిపల్ కమిషనర్ దుర్గేష్‌సామ్రాట్ తెలిపారు. పాన్‌కార్డును అనుసంధానం చేయకపోతే నగదు లావాదేవీలకు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఇటీవల తిరుపతి నగరంలో ఓ రియాల్టర్‌పై దాడులు నిర్వహించామని, రికార్డులను సీజ్ చేసి లెక్కలను ఇంకా మదింపు చేస్తున్నట్లు చెప్పారు.

చెత్తపెంటలో గంజాయి సాగు

పలమనేరు: మండలంలోని అటవీసమీప గ్రామమైన చెత్తపెంటలో ఓ వ్యక్తి రహస్యంగా గంజాయి సాగుచేస్తున్న విషయం గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు, సెబ్ అధికారుల కథనం మేరకు.. చెత్తపెంట గ్రామానికి చెందిన అయ్యప్పన్ అనే వ్యక్తి తన పొలంలో రహస్యంగా గంజాయి సాగు చేశాడు. రహస్య సమాచారంతో అధికారులు దాడులు చేశారు. సాగులో ఉన్న గంజాయి మొక్కలు, దాచి ఉంచిన పది గ్రాములు గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్టు స్థానిక సీఐ చంద్రశేఖర్, సెబ్ సీఐ ఎల్లయ్య తెలిపారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం



కల్యాణ మండపంలో కొలువుదీరిన ఉత్సవమూర్తులు



సీతారాములకు పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న నల్లందుల సుధాకర్‌రెడ్డి దంపతులు, హాజరైన ఎమ్మెల్యే చెవిరెడ్డి దంపతులు

తిరుపతి రూరల్: శ్రీరామనవమి వేడుకలు గురువారం తుమ్మలగుంటలో కనులపండువగా సాగాయి. శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం భక్తులతో సందడిగా మారింది. బాజాభజంత్రీలు, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శ్రీసీతారాముల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. జగదభిరాముని కల్యాణాన్ని భక్తులు కనులారా వీక్షించి తరించారు. ముందుగా ఆలయంలోని స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను కల్యాణ మండపానికి వేంచేపు చేశారు. అనంతరం విశ్వక్సేనారాధన, గణపతి పూజతో కల్యాణం దిగ్విజయంగా కొనసాగాలని కోరుతూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చక స్వాములు రక్షాబంధనాలను సీతారాముల వారి ముంజేతికి అలంకరింపజేశారు. సుముహూర్తాన అర్చకులు స్వామి,అమ్మవార్ల తలలపై జీలకర్ర, బెల్లం పెట్టారు. అనంతరం మంగళసూత్రాన్ని భక్తులకు దర్శింపజేసి రాములవారి చేతులకు తాకించి సీతాదేవి మెడలో అలంకరించారు. భక్తులు జయజయధ్వానాల నడుమ తలంబ్రాలను సీతారాముల తలలపై ఉంచి కల్యాణోత్సవ కార్యక్రమాన్ని ముగించారు. అంతకుముందు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి దంపతులు వివాహ మహోత్సవానికి విచ్చేసి స్వామి, అమ్మవార్లను దర్శించారు.



బంగారం :

24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.61,340
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,479

వెండి:

హోల్‌సేల్ ధర (కిలో)	రూ.73,100
రిటైల్ వెండి గ్రాము	రూ.75.10

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	37	24
చిత్తూరు	37	25
తిరుమల	33	21
గూడూరు	38	27
నగరి	38	26

వానపాముల అక్రమరవాణా అరికట్టేందుకు చర్యలు

- వేధిస్తున్న సిబ్బంది కొరత
- అయినా సరే అడ్డుకుంటాం

సూళ్లూరుపేట: పులికాట్ సరస్సు నుంచి వానపాముల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు తగినంత సిబ్బంది లేకున్నా అడ్డుకుంటున్నామని, తరచుగా దాడులు చేస్తున్నామని పులికాట్ పక్షుల రక్షిత కేంద్రం అటవీక్షేత్ర అధికారి బీ.నరసింహారావు పేర్కొన్నారు. ఈనెల 20న ꞉పులికాట్‌కు గర్భశోకంꞋ శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన ప్రతిస్పందించారు. ఆమేరకు కొన్ని విషయాలను వెల్లడించారు. పులికాట్ రేంజి పరిధిలో ఒక సెక్షన్ ఉందని, అందులో సెక్షన్ ఆఫీసర్ మెడికల్ సెలవులో ఉన్నారని తెలియజేశారు. 15 బీట్లకు గాను 11 మంది బీట్ అధికారులు ఉన్నారని, అందులో ఇద్దరు మెడికల్ బీట్ అధికారులు ఉన్నారని తెలిపారు. 15 బీట్లకు గాను 15 మంది అసిస్టెంట్ బీటు అధికారులు ఉండాల్సి ఉండగా ఒక్క అసిస్టెంట్ బీట్ అధికారి మాత్రమే ఉన్నారని తెలియజేశారు. సిబ్బంది కొరత ఉండడం వల్ల విధుల నిర్వహణకు కష్టతరంగా ఉన్నప్పటికీ పక్క బీటు నుంచి సిబ్బందిని పిలిపించి వేనాడు, ఇరకం బీటు అధికారులతో పాటు బృందాలను ఏర్పాటుచేసి గస్తీ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం ఉన్న సిబ్బందితోనే వానపాముల అక్రమ రవాణా చేస్తున్న వ్యక్తులను పట్టుకుని వారిపై కేసులు పెట్టి, జరిమానాలు విధిస్తున్నామని తెలిపారు. అక్రమరవాణా జరగకుండా శతవిధాలా ప్రయత్నాలు చేస్తున్నామని తెలియజేశారు. సూళ్లూరుపేట వన్యప్రాణి విభాగానికి వచ్చే ఆర్థిక సంవత్సరంలో స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది మంజూరు కోసం పై అధికారులకు నివేదిక పంపామని, మంజూరు అయిన వెంటనే ఒక ప్రత్యేక వాహనం, నలుగురు సిబ్బంది అదనంగా సమకూరుతారని చెప్పారు. ప్రస్తుతం ఉన్న సిబ్బందితోనే గస్తీని పటిష్టంగా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. డీఎఫ్‌ఓ నుంచి కిందిస్థాయి సిబ్బంది వరకు వానపాముల అక్రమరవాణా చేసే వారినుంచి ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గానీ ఎటువంటి ప్రమేయం లేదని, ఎలాంటి అక్రమ వసూళ్లకు పాల్పడలేదని తెలియజేశారు. పులికాట్ సరస్సులో ఎక్కడ కూడా వానపాములు అక్రమంగా తవ్వకాలు, రవాణా చేయడంపై సిబ్బందిని అప్రమత్తం చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఇక నుంచి దీనిపై అనుక్షణం అప్రమత్తంగా ఉండి పులికాట్ సరస్సు ఉనికిని కాపాడేందుకు సర్వశక్తులు ఒడ్డుతామని స్పష్టం చేశారు.

బీజేపీపై రాజకీయపరమైన ఉద్యమం అవసరం

- 14 నుంచి దేశ్‌కా బచావో.. మోదీ హఠావో నినాదంతో నిరసనలు
- సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

తిరుపతి కల్చరల్: ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ కార్పొరేటర్లకు ఊడిగం చేస్తున్న బీజేపీ ప్రభుత్వంపై రాజకీయపరమైన ఉద్యమం అవసరమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ దేశ్‌కా బచావో-మోదీ హఠావో అన్న నినాదంతో ఏప్రిల్ 14 నుంచి మే 15వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లో చైతన్యం తెస్తామని తెలిపారు. తిరుపతి సీపీఐ కార్యాలయంలో గురువారం సాయంత్రం సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రాహుల్ పట్ల కుట్రపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. ఆర్థిక నేరగాడు నీరవ్ మోదీతో రాహుల్ గాంధీని విమర్శించడం బీజేపీకి తగదన్నారు. రాహుల్ గాంధీ పట్ల కేంద్ర వైఖరిని నిరసిస్తూ అన్ని రాజకీయ పార్టీలతో కలిసి త్వరలో ఉద్యమం చేపడతామన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పూర్తిస్థాయి నష్టపరిహారం ఇప్పటికీ ఎందుకు ఇవ్వడం లేదని కేంద్రాన్ని నిలదీసి పోలవరం బాధితులను ఆదుకోవాలన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నేతలు హరినాథరెడ్డి, జయలక్ష్మి, మురళి, నాగరాజు, చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ, విశ్వనాథ్, నదియా పాల్గొన్నారు.

ముగిసిన ఫ్లోర్ కర్లింగ్ పోటీలు



ట్రోఫీ, మెడల్స్ అందుకున్న క్రీడాకారులు

నెల్లూరు(టౌన్): నెల్లూరు వేదాయపాళెంలో ఉన్న ఎల్ఎల్ఎఫ్ స్కూల్లో రాష్ట్ర స్థాయి కర్లింగ్ పోటీల ముగింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఫ్లోర్ కర్లింగ్ గేమ్ అసోసియేషన్ అధ్యక్షుడు సురేంద్రరెడ్డి మాట్లాడుతూ సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ఓవరాల్ చాపియన్‌షిప్‌ను తిరుపతి, ద్వితీయ స్థానాన్ని నెల్లూరు, తృతీయ స్థానాన్ని కర్నూలు జిల్లా క్రీడాకారులు కైవసం చేసుకున్నారని తెలిపారు. వీరు మే 19 నుంచి 21వ తేదీ వరకు అరుణాచల్‌ప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విజేతలకు, రాణించిన క్రీడాకారులకు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ట్రోఫీలు, మెడల్స్ ప్రదానం చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కొండారెడ్డి, సెక్రటరీ మనోహర్, వైఎస్సార్‌సీపీ 28వ డివిజన్ ఇన్‌చార్జి మదన్‌మోహన్‌రెడ్డి, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి వాహన సేవలో హైకోర్టు న్యాయమూర్తులు



హనుమంత వాహన సేవలో జస్టిస్ సుజాత



హనుమంత వాహన సేవలో డీవీఎస్ఎస్ సోమయాజులు

తిరుమల: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ డీవీఎస్ఎస్ సోమయాజులు, జస్టిస్ వి.సుజాత గురువారం రాత్రి తిరుమలలో నిర్వహించిన శ్రీవారి వాహన సేవలో పాల్గొన్నారు. జస్టిస్ సోమయాజులు, జస్టిస్ సుజాత గురువారం రాత్రి వేర్వేరుగా తిరుమలకు చేరుకున్నారు. శ్రీరామ నవమి సందర్భంగా రాత్రి నిర్వహించిన హనుమంత వాహన సేవలో పాల్గొన్నారు.

పోలీస్ జీపును ఢీకొన్న ట్రాక్టర్

- నాయుడుపేట అర్బన్ సీఐకి తీవ్ర గాయాలు
- స్వల్ప గాయాలతో బయటపడ్డ ముగ్గురు పోలీసులు



చికిత్సలు పొందుతున్న సీఐని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య తదితరులు

నాయుడుపేట టౌన్ : మండల పరిధిలోని పండ్లూరు ఉక్కు పరిశ్రమ సమీపంలో జాతీయ రహదారిపై గురువారం పోలీసులు వెళుతున్న జీపును ట్రాక్టర్ అదుపుతప్పి ఢీకొంది. నాయుడుపేట అర్బన్ సీఐ సీహెచ్ ప్రభాకర్ రావుతో పాటు ఏఆర్ కానిస్టేబుల్ భాస్కర్ (జీపు డ్రైవర్), చిరంజీవి, హోంగార్డు వెంకికి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసుల కథనం.. నాయుడుపేట అర్బన్ సీఐ ప్రభాకర్‌రావు తన వాహనంలో పండ్లూరు వైపు నుంచి నాయుడుపేటకు బయలుదేరారు. మార్గమధ్యంలో పండ్లూరు రైల్వే గేటు దాటిన తర్వాత ఉక్కుపరిశ్రమ సమీపంలోకి వచ్చేసరికి ముందు నుంచి కట్టెల లోడ్డుతో వస్తున్న ట్రాక్టర్ ఒక్కసారిగా అదుపు తప్పి పోలీసు వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పోలీసు వాహనంలో ముందు వైపు కూర్చొని ఉన్న సీఐకి గాయాలయ్యాయి. వెనుక కూర్చొని ఉన్న ముగ్గురు పోలీసులు స్వల్పంగా గాయపడ్డారు. మెరుగైన చికిత్సల కోసం సీఐని నెల్లూరులోని ప్రయివేటు వైద్యశాలకు తరలించారు. పోలీసుల వాహనం దెబ్బతింది.

ఎమ్మెల్యే పరామర్శ

విషయం తెలుసుకున్న సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య హుటాహుటీన నాయుడుపేటలోని వైద్యశాలకు వెళ్లి పోలీసులను పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యేతో పాటు నాయుడుపేట రూరల్ సీఐ వైవీ సోమయ్య, ఎస్ఐ శ్రీకాంత్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి, నాయకులు కామిరెడ్డి రాజారెడ్డి, పోట్లాపూడి రాజేష్, చదలవాడ కుమార్ తదితరులు ఉన్నారు.





తిరుపతి కలెక్టరేట్‌లో కాఫీ పొడర్‌తో తయారు చేస్తున్న అంబేడ్కర్ చిత్రాన్ని పరిశీలిస్తున్న సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ

కాఫీ పొడర్‌తో అంబేడ్కర్ చిత్రాన్ని రూపొందిస్తున్న సూక్ష్మ చిత్రాల కళాకారుడు పల్లి చిరంజీవి (ఫైల్)

అపు'రూపం'

తిరుపతి అర్బన్: కలెక్టరేట్ కార్యాలయ ఆవరణంలో తిరుపతి జీవకోనకు చెందిన పల్లి చిరంజీవి మైక్రో ఆర్టిస్ట్ (జాతీయ కళాశ్రీ అవార్డు గ్రహీత) కాఫీ పొడర్‌తో కాటన్ క్లాత్‌పై అంబేడ్కర్ చిత్రాన్ని గీస్తున్నారు. దీన్ని మరో పది రోజుల్లో పూర్తిచేయనున్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఏప్రిల్ 14వ తేదీన దీన్ని ఢిల్లీలోని ఆంధ్ర భవన్‌లో ప్రదర్శించనున్నారు. కాటన్ క్లాత్‌పై 132 అడుగుల పొడవు, 60 అడుగుల వెడల్పుతో 20 రోజులు శ్రమించి ప్రపంచ రికార్డును సాధించడానికి ప్రయత్నిస్తున్నట్టు చిరంజీవి చెబుతున్నారు. గతంలో కాఫీ పొడర్‌తో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రాన్ని రూపొందించి ఆకట్టుకున్నారు. ఇదిలావుండగా గురువారం సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అంబేడ్కర్ చిత్రాన్ని పరిశీలించి, కళాకారుడికి అభినందనలు తెలిపారు.

శ్రీరాముడి చిత్రపటం బహూకరణ



చిత్రపటాన్ని అందిస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి రూరల్): తొట్టంబేడు మండలం, చిన్నకనపర్తి గ్రామ సమీపంలోని దళితవాడ రామాలయానికి లక్షా ఐదు వేల రూపాయల విలువ చేసే చిత్రపటాన్ని మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి అందజేశారు. గురువారం శ్రీరామనవమిని పురస్కరించుకుని సిద్ధారెడ్డి రాజారామిరెడ్డి, కమలమ్మ జ్ఞాపకార్థం శ్రీరాముడు, సీత, లక్ష్మణుడు, అంజనేయస్వామితో కూడిన స్వర్ణ రంగులోని చిత్రపటాన్ని ఆమె గ్రామస్తులకు అందజేశారు. సర్పంచ్ సుబ్రమణ్యం, మణినాయుడు, ఎంపీటీసీ సుబ్రమణ్యం, ధనంజయులు, గోపి, రాఘవులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా : నలుగురు కూలీలకు గాయాలు



దొరవారిసత్రం: ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో నలుగురు మహిళా కూలీలు గాయపడిన ఘటన తనియాలి గ్రామ సమీపంలోని పంట పొలాల్లో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం... కల్లూరు గ్రామం నుంచి ఉచ్చూరు గ్రామ పరిధిలో మిరప కోత కోసం దుకు సుమారు పది మంది కూలీలతో ట్రాక్టర్ బయలుదేరింది. తనియాలి గ్రామ సమీపంలోని మలుపు వద్ద అదుపు తప్పి పంట పొలంలో బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో కల్లూరు గ్రామానికి చెందిన ప్యారమ్మ, హసీన, సఫరాబీ, రత్నమ్మ గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం నాయుడుపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం ప్యారమ్మ, రత్నమ్మను నెల్లూరు తీసుకెళ్లారు.

రేషన్ బియ్యం పట్టివేత

వెంకటగిరి రూరల్(బాలాయపల్లి): అక్రమంగా రవాణా చేస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న ఘటన వెంకటగిరి-గూడూరు మార్గంలోని బాలాయపల్లి మండలం, వెంకటరెడ్డిపల్లి గ్రామం వద్ద గురువారం చోటుచేసుకుంది. విజిలెన్స్ అధికారుల కథనం.. వెంకటగిరి నుంచి గూడూరుకు రేషన్ బియ్యం అక్రమంగా తరలుతున్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు విజిలెన్స్ ఎస్ఐ రామకృష్ణనాయక్, సివిల్ సప్లై సంధ్య దాడులు నిర్వహించి వెంకటరెడ్డిపల్లి వద్ద ఐచర్ లారీని అదుపులోకి తీసుకున్నారు. ఇందులో 112 బస్తాలు (5 టన్నులు 200 కేజీలు) బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.1.89 లక్షలు ఉంటుందని అంచనా. వాహనాన్ని స్వాధీనం చేసుకుని బాలాయపల్లె సివిల్ పోలీసులకు అప్పగించారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

సమతా సైనిక్‌దళ్ యూత్ అధ్యక్షుడిగా శివకుమార్

గుడిపాల: బాబా సాహెబ్ డాక్టర్ అంబేడ్కర్ సమతా సైనిక్‌దళ్ యూత్ చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా గుడిపాల మండలంలోని 189 కొత్తపల్లెకు చెందిన శివకుమార్ నియమితులయ్యారు. దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆమూరు సుధాకర్ ఈ మేరకు ఆయనకు నియామక పత్రం అందజేశారు.